క్లుప్తంగా

పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామం నుంచి దుబ్బపల్లి, తుర్కపల్లి గ్రామాలకు వెళ్లే రహదారి పక్కనే విద్యుత్ స్తంభానికి పిచ్చిమొక్కలు అల్లుకొని ప్రమాదకరంగా మారి ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందారు. ఈ దుస్థితిపై 'ప్రమాదకరంగా స్తంభం' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం అయ్యింది. ఇందుకు స్పందించిన ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ జనగామ శ్రావణ్ వెంటనే స్పందించి సంబంధిత లైన్‌మెన్ వెంకటస్వామికి ఆదేశాలు జారీ చేశారు. స్తంభానికి అల్లుకున్న పిచ్చి మొక్కలను గురువారం తొలగించారు.

గుంత పూడ్చారు..!



సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మురికి కాలువలు పూడిక తీయకపోవడంతో మురికి నీరంతా రోడ్లపైనే పారుతున్నాయని 'కంపు కొడుతున్న కాలనీలు' అనే శీర్షిక న మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం అయ్యింది. ఇందుకు ఎంపీవో అజ్మత్ అలీ వెంటనే స్పందించారు. సుద్దాల పంచాయతీ కార్యదర్శి కళకు ఆదేశాలు జారీ చేయగా తుర్కపల్లికి వెళ్లే దారిలో మురికినీటి గుంతలో ఇసుకను పోయించి గుంతను పూడ్చి వేయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

గురుకులాల్లో సీట్ల భర్తీ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ, విద్యార్థులు గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 17న సాయంత్రం 5గంటల లోగా లక్సెట్టిపేట బాలికల గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీనారాయణ

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ అధికారిగా లక్ష్మీనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లి డివిజన్ కుశ్నపల్లి రేంజ్‌లో డీఆర్వోగా పని చేస్తున్న ఆయనను ఇన్‌చార్జి రేంజ్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడటంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేంజ్ పరిధిలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

డ్రెయినేజీలు శుభ్రం చేయరూ..!



మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని కాలేజీరోడ్డులో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారంను తొలగించేందుకు కార్పొరేషన్ సిబ్బంది డ్రెయినేజీలకు ఉన్న సిమెంట్ బిల్లలను తీసి పక్కన పెట్టి అలాగే వదిలేశారు. పది రోజులైనా డ్రెయినేజీలను శుభ్రం చేయరూ, సిమెంట్ బిల్లలను కాలువ పై దుకాణాలకు వెళ్లేవారు వేసుకుందామంటే వేసుకోనివ్వరూ. కాలువల్లో ఇప్పటికే పేరుకుపోయిన చెత్తతో ఆ ప్రాంతం అంతా దుర్వాసన వస్తుండగా, దుకాణాలకు వెళ్లే వారితో పాటు, యజమానులకు ఇబ్బందిగా మారింది.

గాలికుంటు నివారణకు ప్రత్యేక డ్రైవ్

- ఊరూరా పశువైద్య శిబిరాలు
- నెల రోజుల పాటు పశువులకు వ్యాక్సినేషన్
- సద్వినియోగం చేసుకోవాలని వైద్యుల సూచన



ముత్యంపేటలో గేదెకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి ధన్‌రాజ్

దండేపల్లి: జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను బుధవారం నుంచి ప్రారంభించారు. కార్యక్రమం వచ్చే నెల 14వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పశు వైద్యాధికారి శంకర్ తెలిపారు. జిల్లాలోని 2,42,000 గేదె, గోజాతి పశువులకు టీకాలు లక్ష్యంగా నిర్ణయించారు.

6 నెలలకొకసారి..

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. నాలుగు నెలలు దాటిన ఆవులు, గేదెలకు ఆరు నెలలకోసారి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తారు. వ్యాధి సోకడంతో మరణాల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, వ్యాధి కారణంగా పశువుల్లో ఉత్పాదక, పునరుత్పత్తి శక్తి సామర్థ్యం కుంటుపడుతుంది. చిక్కిపోయి ఆహారం తీసుకోకుండా ఉంటాయి. మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్, ఆక్టోబర్ నెలల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. దీంతో పాడి రైతులకు ఆర్థికంగా నష్టం జరుగుతుంది.

టీకాలతో ప్రయోజనం..

ప్రతీ ఆరు నెలలకు ఒకసారి టీకాలు ఇప్పిస్తే గాలికుంటు వ్యాధి సోకకుండా నివారించవచ్చు. దూడల మరణాలను అరికట్టవచ్చు. పాల ఉత్పత్తి తగ్గకుండా ఉంటుంది. టీకాలతో పశువుల్లో పనిసామర్థ్యం తగ్గకుండా ఉండే అవకాశం ఉంది. టీకాలు చూడి పశువులకు కూడా సురక్షితమే. అని పశువైద్య సిబ్బంది పేర్కొంటున్నారు.

వచ్చే నెల 14 వరకు..

జిల్లాలోని 44పశువైద్యశాలల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 15నుంచి వచ్చే నెల 14వరకు నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతుంది. ఈ మేరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఇంటింటికీ వెళ్లి పశువైద్య సిబ్బంది పశువులకు టీకాలు వేయనున్నట్లు జిల్లా పశువైద్యాధికారి తెలిపారు. కాగా వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నారు కాబట్టి పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

అప్రమత్తంగా పనిచేయాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

శ్రీరాంపూర్: సింగరేణి ఆస్తుల పరిరక్షణలో ఎస్అండ్‌పీసీ డిపార్టుమెంట్ ఉద్యోగులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కార్పొరేట్ సెక్యూరిటీ విభాగం జీఎం లక్ష్మీనారాయణ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఏరియా సెక్యూరిటీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సంస్థ ఆస్తులను కాపాడడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దొంగతనాల నివారణ కోసం తగిని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలతో భద్రతను మరింత పటిష్ఠం చేయాలన్నారు. గనులపై ఉన్న స్క్రాప్, కాపర్ ఇంకా ఇతర ఖరీదైన యంత్ర సామగ్రిలను చోరీకి గురికాకుండా రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేట్ శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీ సైదా, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, ఇన్‌స్పెక్టర్ రాజన్న పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్: రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి బోనస్‌ను చెల్లించాలన్నారు. ప్రతీ సారి లాభాల వాటా చెల్లించడంతో రిటైర్డ్ కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. వెంటనే లాభాల వాటా, దీపావళి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

బొగ్గుబాయి వార్తలు

ఆయుర్వేద వైద్య శిబిరం

శ్రీరాంపూర్: ఈ నెల 18న నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) ఎస్ అనిల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక జబ్బులైన బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు వంటి తగిన పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

చెట్లు నరికిన వ్యక్తుల బైండోవర్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ జన్నారం సెక్షన్ పరిధిలోని గొండుగూడ బీట్‌లో ఇటీవల చెట్లు నరికిన ఇద్దరిని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు ఇన్‌చార్జి రేంజ్ అధికారి మమత తెలిపారు. జువ్విగూడ గ్రామానికి చెందిన జాదవ్ సుధన్, జాదవ్ దేవిదాస్‌లకు చెట్ల నరికివేతలో ప్రమేయమున్నట్లు విచారణలో తేలడంతో వారిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు తెలిపారు. సంవత్సరం వరకు చెట్లు నరికివేతకు పాల్పడితే పై ఇద్దరికి రూ.1లక్ష జరిమానా లేదా జైలు శిక్ష ఉంటుందని రేంజ్ అధికారి తెలిపారు. వారి వెంట బీట్ అధికారి లాల్‌బాయి ఉన్నారు.

గూడెం జీపీకి ఎన్నికలు నిర్వహించాలి

దండేపల్లి: మండలంలోని గూడెం గ్రామ పంచాయతీని ఏజెన్సీ నుంచి తొలగించి ఎన్నికలు నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం గ్రామసభకు హాజరైన తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేకు వినతిపత్రం అందించారు. గ్రామంలో గిరిజనులు లేకున్నా తమ గ్రామాన్ని ఏజెన్సీ గ్రామంగా గుర్తించడంతో 35ఏళ్లుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం లేదని, దీంతో గ్రామానికి సర్పంచ్ లేక గ్రామంలో అభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. అధికారులు సర్వే చేసి గూడెం ఏజెన్సీని తొలగించాలని కోరారు. ఈ సారి జరిగే స్థానిక ఎన్నికల్లో గూడెం గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

వేమనపల్లి: మండలంలోని గొర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తాళ్ళ నానయ్య(70) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన 2004–2009లో తెలుగుదేశం పార్టీ తరుపున సర్పంచ్‌గా పనిచేశారు. రెండు నెలలుగా షుగర్‌తో పాటు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య భాగ్య, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని పలు రాజకీయ, కుల సంఘాల నాయకులు పరామర్శించి సంతాపం ప్రకటించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఆర్డీవో శ్రీనివాస్



ఉత్పత్తులను తిలకిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

మంచిర్యాలఅర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఆర్డీవో గుడూరు శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం క్యాంపస్ ఏకో బజార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో పర్యావరణ చైతన్యం పెంపొందించటం సమాజానికి గొప్ప పెట్టుబడి అన్నారు. విద్యార్థుల్లో పచ్చదనంపై చైతన్యం పెంచి సైన్స్, పర్యావరణాన్ని కలిపి చూడటం అవసరమని సూచించారు. ఈ సందర్భంగా 25స్టాళ్లలో 75మంది విద్యార్థులు తమ సృజనాత్మతక ఉత్పత్తులను ప్రదర్శించారు. మట్టి దీపాలు, జ్యూట్ సంచులు, పునర్వినియోగ పదార్థాలు పచ్చదనం ప్రోత్సహించే ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, తెలంగాణ వాల్టా యాక్టు అథారిటీ సభ్యుడు యోగేశ్వర్, ప్రిన్సిపాల్ జైకిషన్‌ఓజా, ఎన్‌జీసీ ఇన్‌చార్జి జాడి మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● ఇంటింటికి బాకీకార్డుల పంపిణీ

మందమర్రిరూరల్/శ్రీరాంపూర్: నస్పూర్‌లోని 11వ వార్డులో, మందమర్రి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ఎండగట్టారు. మందమర్రిలో చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్, నస్పూర్‌లో వార్డు నాయకుడు ఎండీ హైమద్, ఆ పార్టీ నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, వంగ తిరుపతి తదితరులు ఉన్నారు.

● విద్యుత్ అధికారుల 'పొలంబాట'

చెన్నూర్‌రూరల్: మండలంలోని గంగారంలో విద్యుత్ శాఖ అధికారులు గురువారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. రైతులకు విద్యుత్ సమస్యలకు సంబంధించిన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ కేశెట్టి శ్రీనివాస్, లైన్‌మెన్లు, రైతులు పాల్గొన్నారు.

● వర్మీ కంపోస్టు పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని సూరారం గ్రామ పంచాయతీ సెగ్రిగేషన్ షెడ్‌లో తయారు చేసిన వర్మీ కంపోస్టును ఎంపీడీవో సరోజ గురువారం రైతులకు అందజేశారు. ప్రతీ ఒక్కరు వర్మీ కంపోస్టు తయారు చేసుకోవాలని తెలిపారు. ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

● పార్ట్–2 పాఠ్యపుస్తకాల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలకు అందించే 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పార్ట్ –2 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఎంఈవో కార్యాలయంలో గురువారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో మాళవీదేవి అందజేశారు.

● సీపీఆర్‌పై అవగాహన

దండేపల్లి: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దండేపల్లి, తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 108 సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లకు సీపీఆర్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీల వైద్యులు సతీష్, క్రాంతికుమార్ సీపీఆర్ గురించి వివరించారు.

శ్రీరాంపూర్: సీసీసీ కార్నర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. నస్పూర్ పీహెచ్‌సీ వైద్యులు వెంకటేశ్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగులకు, అధికారులకు శ్వాస ఆగిపోతున్నప్పుడు సీపీఆర్ ఎలా చేయాలో చూపించారు. కార్యక్రమంలో 108జిల్లా మేనేజర్ సంపత్, సిబ్బంది రమేశ్, సతీశ్, దేవయ్య పాల్గొన్నారు.

● విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దు

లక్సెట్టిపేట: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావద్దని ప్రముఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ సునీల్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో గురువారం విద్యార్థు ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ లింగారెడ్డి, వైద్యాధికారి సతీష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రమాకళ్యాణి, సిబ్బంది గీతాంజలి, శిరీష, పల్లవి, సుజాత పాల్గొన్నారు.

గుంత.. ప్రయాణికుల చింత

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి నుంచి మామడ వెళ్లే దారిలో రోడ్డుపై గుంత ప్రమాదకరంగా ఉంది. పైప్ కల్వర్ట్ ఉండగా రెండు మీటర్ల లోతు గొయ్యి ఏర్పడింది. ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని కొందరు ప్రయాణికులు గుంతలో చెత్త, ఒక కర్ర పెట్టి ప్రమాద సూచిక ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.



అనుమతులు లేని నిర్మాణాలపై కొరడా..!



మందమర్రి ఏరియా జీఎం ఆఫీస్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి స్థలంలోనే కాదు, కార్మికులకు కేటాయించిన సింగరేణి క్వార్టర్ల ఆవరణలో కూడా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఓ కార్మికుడికి టీ టైపు క్వార్టర్ కేటాయించగా తనకు కేటాయించిన క్వార్టరే కదా అని మరమ్మతుతో పాటు ఓ హాల్, చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారు. ఓ పెద్ద గేటు ఏర్పాటుకు సన్నద్ధం కాగా అధికారులు అనుమతులు లేకుండా నిర్మాణం ఎలా చేపట్టావని నిర్మాణాన్ని నిలిపివేసి గేటును స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. సింగరేణి గతంలో క్వార్టర్లు నిర్మించినప్పుడు కేవలం ఒక ఒక హాల్, బెడ్ రూం, కిచెన్, మరో చిన్న డైనింగ్ గది మాత్రమే ఉంది. కార్మికుడి పిల్లలు పుట్టిన వారు పెరిగి పెద్దవుతున్నారు. కనీసం వారికోసం గది నిర్మాణం చేపడితే తప్పేంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా యాజమాన్యం కేటాయించిన క్వార్టర్లో పెద్ద కుటుంబానికి సరిపడా గదులు లేవని, నూతనంగా యాజమాన్యం సౌకర్యంతో కూడిన క్వార్టర్లు కేటాయించాలని, అదనంగా గదులు నిర్మించి ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు. ఈ విషయమై ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ నగునూరి రవిని వివరణ కోరగా ఏరియాలోని క్వార్టర్ ఆవరణలో అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, ఒకవేళ అదనంగా నిర్మాణాలు అవసరమైతే ఏరియా జీఎంకు దరకాస్తు చేసుకుంటే హౌజ్ కమిటీ ద్వారా పరిశీలించి అనుమతిస్తామని, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు ఉంటాయని అన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు యోగా చేయాలి

- డీఎంహెచ్‌వో అనిత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

భీమారం: ప్రతీ విద్యార్థి రోజులో కొంత సమయాన్ని యోగాకి కేటాయించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత కోరారు. నేషనల్ మెంటల్ హెల్త్ పోగ్రాంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకోవాలన్నారు. అకస్మాత్తుగా గుండెపోటు వస్తే ఆ వ్యక్తికి సీపీఆర్ చేసే పద్ధతిని ఆమె విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు వంశీకృష్ణ, జైపూర్ మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా, పాఠశాల ప్రత్యేక అధికారి కనకలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. కొత్తగా ఏర్పడ్డ భీమారం పీహెచ్‌సీలో గల సదుపాయాలతో పాటు పరికరాలను ఆమె వైద్యులు డాక్టర్ వంశీకృష్ణని అడిగి తెలుసుకున్నారు. అవసరం ఉన్న పరికరాలను తెప్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జైపూర్ ఆరోగ్యకేంద్రం నుంచి మందులు సరఫరా చేస్తున్నామని, త్వరలో పూర్తి స్థాయిలో అన్ని రకాల సేవలు అందించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు



నినాదాలు చేస్తున్న బీసీ సంఘాల నేతలు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలఅర్బన్/జన్నారం/భీమారం/పాతమంచిర్యాల/బెల్లంపల్లి/మంచిర్యాలటౌన్: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న బీసీ సంఘాలు నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌కు గురువారం పలువురు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సీపీఐ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బెల్లంపల్లిలో పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్ వేర్వేరుగా విలేకరుల సమావేశాల్లో తెలిపారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, భీమారంలో బీసీ సంఘాల నాయకులు, జన్నారంలో మున్నూరు కాపు సంఘం నాయకులు మద్దతు తెలిపారు. మంచిర్యాల శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి బీసీ జేఏసీ బంద్‌కు మంచిర్యాల ప్రైవేట్ విద్యాసంస్థలు మద్దతు ప్రకటించాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్ దక్కకుండా బీజేపీ, రెడ్డి సామాజికవర్గం అడ్డుపడుతోందన్నారు. హైకోర్టులో వేసిన పిటీషన్‌ను రెడ్డి సామాజిక వర్గం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రబంద్‌కు అన్ని వర్గాల ప్రజలు, వ్యాపార వాణిజ్యవర్గాలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించి జయప్రదం చేయాలని కోరారు. ఆయా పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బెల్లంపల్లి సీఐ హనోక్

నెన్నెల: గుండె ఆపరేషన్ చేయించుకునేందుకు చిల్లిగవ్వ చేతిలో లేక ఏమి చేయాలో తోచక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ నిరుపేద మహిళకు గురువారం పోలీసులు ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రంలోని నేతకాని వాడకు చెందిన దుర్గం రాజక్క గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతూ ఆస్పత్రికి వెళ్లేందుకు వైద్యఖర్చులకు డబ్బులు లేక గుడిసెలోనే పడి ఉన్న విషయాన్ని తెలుసుకున్న బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ రూ.10వేల నగదుతో పాటు 25కిలోల సన్న బియ్యాన్ని, ఎస్సై ప్రసాద్ రూ.5వేలు, ఎంపీడీవో అబ్దుల్‌హై రూ.2వేలు, పాత్రికేయులు రూ.3వేలు, కోవిడ్ వాలంటరీ వ్యవస్థాపకుడు భీంపుత్ర శ్రీనివాస్ రూ.10వేలు మొత్తం రూ.30వేల ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. పేద తల్లికి పెద్ద ఆపద రావడంతో ఇంట్లో ఉన్న మానసిక వికలాంగురాలైన కూతురికి కష్టం వచ్చిపడింది. మంచంలో నుంచి లేచి నిలబడి స్వయంగా తన పనులు తాను చేసుకోలేని కూతురు, వచ్చిన వారి వైపు దీనంగా చూస్తుంటే దుఃఖం ఆపుకోలేకపోతున్నారు. అలాంటి కుటుంబానికి దాతలు స్పందించి చేయూతనందించిన మానవతామూర్తులకు కుటుంబ సభ్యులు చేతులెత్తి మొక్కుతున్నారు.

బెల్లంపల్లి ఆసుపత్రికి బస్ సౌకర్యం కల్పించాలి

మంచిర్యాలటౌన్: బెల్లంపల్లిలోని వంద పడకల ఆసుపత్రికి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ అఖిల పక్షం ప్రచార కార్యదర్శి శ్రీనివాస్ గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. హైవే రోడ్డు వల్ల బస్సులను ఆపకుండా వెళ్తున్నారని, ఆసుపత్రికి వెళ్లడానికి ప్రజలకు రూ.100వరకు ఖర్చు అవుతుందని అన్నారు. బెల్లంపల్లిలోని కాంట వద్ద సింగరేణి క్యాంటీన్ ప్రదేశంలో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తూ, వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ఫిజియోథెరపి సెంటర్, బ్లడ్‌బ్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

చెన్నూర్/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం డిమాండ్ చేశారు. తాండూర్ మండల విద్యావనరుల కేంద్రం వద్ద గురువారం సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించి సీఆర్పీలు నాగరాజు, తిరుపతిలకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ అనుబంధ సంఘం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హాజీపూర్‌లో ఎంఈవో కార్యాలయ సిబ్బందికి అందజేశారు. చెన్నూర్‌లో సీఐటీయూ నాయకులు బొడెంకి చందు ఆధ్వర్యంలో ఎంఈవో దత్తకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో తాండూర్‌లో రెడ్డి మల్లక్క, కోట రాధ, జంగుబాయి, వసంత, కమల, నాగమ్మ, హాజీపూర్‌లో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధునమ్మ, మానస, మధ్యాహ్న భోజన కార్మికులు ఉమ, వెంకటమ్మ, నసీం, మల్లమ్మ, సుమలత, చెన్నూర్‌లో మధ్యాహ్న భోజన కార్మికులు కరీంబీ, సుక్కమ్మ, సారక్క, రాజక్క, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్లపై మంత్రికి ఫిర్యాదు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో విధులు నిర్వహిస్తున్న పలువురు వార్డెన్లపై పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ఫిర్యాదు చేశారు. ధర్మపురిలో గురువారం మంత్రిని కలిసి బెల్లంపల్లి, హాజీపూర్‌లో విధులు నిర్వహించే వార్డెన్లు విధులపై అలసత్వం ప్రదర్శిస్తూ విద్యార్థులకు మెనూ అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. మంత్రి స్పందించి సోషల్ వెల్ఫేర్ డిపార్మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీకి ఫోన్‌ద్వారా సంప్రదించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నీగౌడ్‌లు తెలిపారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మార్సీ ద్వారా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ఎంఈవో దత్తకుమార్ ప్రారంభించారు.